# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

SV6 NEWS
సమగ్ర సమాచార వారధి

సంపుటి : 11 సంచిక -118 శుక్రవారం 18-10-2024 పేజీలు -8 వెల.రూ 3




## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

- కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్
- 51వ భారత్ చీఫ్ జస్టిస్ గా నియమితులయ్యే ఛాన్స్
- కేంద్ర ప్రభుత్వం పరిశీలన తర్వాత బాధ్యతలు

న్యూఢిల్లీ,
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన

-మిగతా 3 లో



## మూసీ సుందరీకరణ కాదు..

# మూసీ నది పునరుజ్జీవం

- మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం
- మూడు నెలలు కేటీఆర్, హరీష్, ఈటెల అక్కడ ఉంటారా
- వారికి సకల సౌకర్యాలు కలిగించి ఉంచుతాం
- పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు
- మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా
- మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సీఎం రేవంత్

హైదరాబాద్,
తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై

-మిగతా 3 లో



## జీవో నెంబర్ 29ని రద్దు చేయాలి

- మళ్లీ ప్రిలిమ్స్ నుంచి పరీక్షల ప్రక్రియ
- పాత జీవో ప్రకారమే ఎగ్జామ్ జరపాలని అభ్యర్థన
- పీసీసీ చీఫ్, కేటీఆర్‌లతో విడివిడిగా అభ్యర్థుల భేటీ

హైదరాబాద్,
తెలంగాణలో గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షల వివాదం ముదురుతోంది. మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల ఆందోళనతో నగరంలో వాతావరణం హీటెక్కింది. అటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కీలక నేతలతో అభ్యర్థులతో భేటీ కావడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. గ్రూప-1 అభ్యర్థులు అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశంగా మారింది. గాంధీ భవన్ లో గ్రూప్-1 అభ్యర్థులతో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ భేటీ అయ్యారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల డిమాండ్లను తెలుసుకున్నారు. జీవో 29 రద్దు చేసి పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు

-మిగతా 3 లో



## బీసీలకు అన్యాయం జరిగితే సహించేదే లేదు

- ఎజెండాతో వస్తున్నాం.... సహకరించాలి
- ఎమ్మెస్ ఎంఈ పాలసీలో బీసీలకు వాటా కల్పించాలి
- నాలుగు శాతం ఉన్న జనాభాకు 10 శాతం రిజర్వేషన్లా?
- చిరంజీవులు మాజీ ఐఏఎస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్
- స్థానిక సంస్థలలో బీసీల వాటా ఎంతో తేల్చాలి
- బండా ప్రకాష్, మండలి డిప్యూటీ చైర్మన్ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తాం
- మధుసూదనా చారి, శాసనమండలి ప్రతిపక్ష నేత అప్రమత్తతతో ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీలను గెలిపించుకోవాలి
- తీన్మార్ మల్లన్న, పట్టభద్రుల ఎమ్మెల్సీ... మేమెంతో మాకంత వాటా
- పలువురు వక్తలు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వెబ్సైట్ www.bcif.in

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ):
బుధవారం హబ్సీగూడ కినార గ్రాండ్ హెూటల్ లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

-మిగతా 2 లో



## పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

అధికారులను ఆదేశించిన సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్,
ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు

-మిగతా 3 లో

## బీఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ




- తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే
- ఇది కేటీఆర్, కేసీఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది
- కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది
- బీజేపీ మత రాజకీయాలు చేస్తోంది
- బీఆర్ఎస్‌వి సమావేశంలో కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,
రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే..

-మిగతా 3 లో

## మద్యం ధరలపై కన్నేసిన సర్కార్

ధరలు పెంచే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్,
తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. మద్యంతో ఎంజాయ్

-మిగతా 3 లో







## హయత్‌నగర్‌లో రాచకాల్వ మిస్సింగ్..

- కాలువను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు
- నకిలీ, సర్టిఫికేట్లు, ఫోర్జరీ సంతకాలతో ఆక్రమణ
- నీట మునుగుతున్న పలు కాలనీలు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు
- చర్యలు చేపట్టని అధికారులపై హైడ్రా కేసులు నమోదు చేయాలి..?
- స్థానిక కాలనీవాసుల డిమాండ్



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)
ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాల అక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అయితే కొన్ని మండలాల పరిధిలోని రెవెన్యూ,

-మిగతా 2 లో

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**–రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయి**



హైదరాబాద్,
తెలంగాణలో రాబోయే ఐదురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉత్తర కోస్తా, తమిళనాడులో కేంద్రీకృతమైన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితలం ఆవర్తనం కొనసాగుతుందని.. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని పేర్కొంది. ఎత్తుకు వెళ్లే కొలది నైరుతి దిశకు వంగి ఉందని పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈ నెల 20 వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దాని ప్రభావంతో 22 వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత వాయువ దిశగా పయనిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడేందుకు అవకాశాలున్నాయని చెప్పింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపే, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలుపడుతాయని ఐఎండీ అంచనా వేసింది.

# విమానాలకు వరుస బాంబు బెదిరింపులు

**–ఎయిరిండియా విమానానికి మళ్లీ బెదిరింపు**

**–పరిస్థితిని సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

ముంబై,
వరస బాంబు బెదిరింపుల ఘటనలు భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వరసగా నాలుగో రోజు కూడా బాంబు బెదిరింపు



వచ్చాయి. ముంబై నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ల్యాండింగ్‌కి కొన్ని గంటల ముందు ఎమర్జెన్సీ సిగ్నల్స్‌ని పంపించినట్లు ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్ 24 గురువారం తెలిపింది. విమానం 'స్క్వాకింగ్ 7700' కోడ్‌ని పంపించింది. ఇది సాధారణ అత్యవసర పరిస్థితిని తెలియజేస్తుంది. ముంబై నుంచి ఎయిర్ ఇండియా విబమానం గురువారం ఉదయం 7.05 గంటలకు టేకాఫ్ అయింది. తూర్పు ఇంగ్లండ్ మీద ప్రయాణించే సమయంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. విమానం షెడ్యూల్ ప్రకారం లండన్ హీత్రూ విమానాశ్రయంలో మధ్యాహ్నం 12.05 గంటలకు దిగాల్సి ఉంది. 'స్క్వాకింగ్ 7700' విమాన పరిస్థితిని సమీపంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కి తెలియజేస్తుంది. నాలుగు రోజుల్లో కనీసం 20 విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు 5 ఎయిర్ ఇండియా, రెండు విస్తారా, రెండు ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ బాంబు బెదిరింపుల అంశంపై నిన్న పార్లమెంటరరీ స్టాండింగ్ కమిటీ సమావేశమైంది.

# రూ. 1200 కోట్ల కుంభకోణంపై దర్యాప్తు

**మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు**

ముంబయి,
మహారాష్ట్రలోని ఓ మహిళా ఐపీఎస్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. రూ. 1200 కోట్ల కుంభకోణానికి సంబంధించిన దర్యాప్తు వ్యవహారంలో ఆమె ఫోర్జరీ, నేరపూరిత కుట్రకు పాల్పడడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ తాజాగా వెల్లడించింది. జల్‌గావ్ జిల్లాలోని భైచంద్ హీరాచంద్ రైసోనీ క్రెడిట్ సొసైటీ ఫిక్స్‌డ్ డిపాజిట్ల పేరుతో అనేకమందిని మోసం చేసింది. రూ. 1200 కోట్లకు పైగా కుంభకోణానికి పాల్పడింది. ఈ కుంభకోణం 2015లో వెలుగులోకి వచ్చింది. ఈ కేసు 2020లో సీబీఐకి బదిలీ అయింది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసులను దర్యాప్తు చేసిన సిట్‌కు ఐపీఎస్ అధికారిణి భాగ్యశ్రీ నవ్‌టకే నేతృత్వం వహించారు. ఈ క్రమంలోనే ఆమె దర్యాప్తులో ఎన్నో అవకతవకలకు పాల్పడినట్లు సీబీఐ పేర్కొంది. ఒకే రోజు ఒక్క నేరం కింద మూడు కేసులు నమోదు చేయడం.. కేసు కోసం హాజరుకాకుండానే ఫిర్యాదుదారుల సంతకాలను ఫోర్జరీ చేయడంలో అధికారిణి ప్రమేయం ఉన్నట్లు సీబీఐ విచారణలో తేలింది. దీంతో ఆమె నేరపూరిత కుట్రకు పాల్పడినట్లుగా దర్యాప్తు సంస్థ ఫిర్యాదులో ప్రస్తావించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సీబీఐ కేసు నమోదు చేసింది. 2020లో ఈ వ్యవహారానికి సంబంధించి కంపెనీ డైరెక్టర్లపై సీబీఐ కేసు నమోదు చేసింది. మరుసటి ఏడాది ప్రధాన నిందితుడు జితేంద్ర కందారేను పుణె పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై విచారణ కొనసాగుతోంది.

# హయత్‌నగర్‌లో.. రాచకాల్వ మిస్సింగ్..!





(మొదటి తరువాయి)

ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తూ నాలాలు, కాలువులు, కుంటలు, చెరువుల అక్రమణలు తొలగిస్తున్నారు. కానీ హయత్‌నగర్ మండల పరిధిలో చారిత్రాత్మక రాచకాల్వ మిస్సింగ్ అయినా ఇరిగేషన్ అధికారులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా రాచకాల్వ ద్వారా వెళ్లాల్సిన వరదనీరు చిన్నపాటి వర్షానికే కాలనీలను ముంచెత్తుతోంది. వర్షపునీరు ఇండ్లలోకి, రోడ్లపై చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధృడ సంకల్పంతో హైడ్రాను ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలిగిస్తోందని, అయితే హయత్‌నగర్‌లో మాత్రం ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అవినీతి కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. రాచకాల్వ కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న ఇరిగేషన్, రెవెన్యూ అవినీతి అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**నీట మునుగుతున్న కాలనీలు..**

ఇంజాపూర్ దిలావర్‌ఖాన్ చెరువు నుంచి హయత్‌నగర్ బాతుల చెరువు వరకు ఉన్న రాచకాల్వ పూర్తిగా కబ్జాదారుల కబంధహస్తాల్లో చేరింది. ఫలితంగా రాచకాల్వ ద్వారా సాఫీగా వెళ్లాల్సిన వరద నీరు కాలనీలను ముంచెత్తుతోంది. హయత్‌నగర్ మండల



పరిధిలోని నవోదయకాలనీ రాచకాల్వను కబ్జాచేయడంతో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి పూర్తిగా జలమయమైంది. వర్షపునీరు ఇండ్లలోకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా లక్ష్మీప్రియ కాలనీలో రాచకాల్వను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా ఇరిగేషన్, రెవన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, అక్రమార్కులతో కుమ్మకై వారికి వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నకిలీ, ఫోర్జరీ సంతకాలతో నిర్మాణం..**

రాచకాల్వపై ఓ ప్రముఖ డిజిటల్ దినపత్రిక రిపోర్టర్ నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, ఫోర్జరీ సంతకాలతో ఇంటిని నిర్మించాడు. దాని వెనకాలే మరో వ్యక్తి ఎటువంటి డాక్యుమెంట్లు లేకున్నా రాచకాల్వపైనే ఇంటిని నిర్మిస్తున్నాడు. ఇదే విషయాన్ని జర్నలిస్ట్ డైరీ దినపత్రిక వెలుగులోకి తేవడంతో అక్కడికి వెళ్లిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇంటి డాక్యుమెంట్లను పరిశీలించకుండా ఏదో చేసినట్టు బిల్డప్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇరిగేషన్ అధికారి అశోక్, ఆర్.ఐ నర్సింహాలు అక్రమార్కులతో కుమ్మక్కయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకే రాచకాల్వను జేసీబీలతో చదును చేసి దానిని స్వాధీనం చేసుకోకుండా, నకిలీ, ఫోర్జరీ సర్టిఫికెట్లు తయారు చేసిన, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా.. 30 ఫీట్ల రాచకాల్వపై నిర్మిస్తున్న నిర్మాణాలను కూల్చకుండా, కేవలం 6 ఫీట్లతో అక్రమార్కులకు ఉపయోగపడేలా చదును చేయడం వెనుక అంతర్యం ఏమిటో.. అర్థమవుతోందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అవినీతి అధికారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీసీలకు అన్యాయం జరిగితే సహించేదే లేదు





(మొదటి తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీల డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ.. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఇది నాలుగో సమావేశమని, ఈ సమావేశంలో.... ఈ డబ్ల్యూఎస్, ఎమ్మెస్ ఎంఈ తో పాటు కులగణన అనే అంశంపై తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీ కులాలు అప్రమత్తంగా ఉంటూ రాబోవు రోజులలో ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యన విడుదల చేసిన జీవో 18 కొంత ఆహ్వానించదగ్గ పరిణామమని, ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసేదాకా అప్రమత్తంగా ఉండాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జరిగే అనర్థాలను వివరించారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వెబ్ సైట్ ఆవిష్కరించిన అనంతరం ఈ వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో బీసీ నాయకులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

**శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ....**

కులగణన చేసి, స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన మాట ప్రకారంగా 42 శాతాన్ని కేటాయించి వారి నిబద్ధతను నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అన్ని రంగాలలో బీసీల వాటా కోసం పోరాటం ఉదృతం చేస్తామని తెలిపారు...

**శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ...**

గత కొన్ని ఏళ్లుగా బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని అన్ని పార్టీలు బీసీల వాటా తేల్చకుండా ఎన్నికలలో బీసీ వర్గ ప్రజలకు అన్యాయం చేశాయని, ఇక రానున్న రోజుల్లో ఇలా జరగకుండా ఉండడానికి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి బీసీలు అంతా సంఘటితంగా పోరాడి తమ హక్కును సాధించుకుంటామని తెలిపారు...

**తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.....**

ప్రభుత్వం ఇచ్చిన కుల గణన జీవోతో మనం సంతృప్తి చెందకుండా, అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు... ఈ కుల గణన విషయంలో రేవంత్ రెడ్డి కులగణన విషయంలో అగ్రవర్ణాల ఆధిపత్య పోరుతో పాటు, ఎన్నో కుట్రలు, కుతంత్రాలు దాగుండే అవకాశం ఉందని దీనితో బీసీ వాదులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ వాదులను గెలిపించుకునేలా బీసీ వాదులంతా ఏకం అవ్వాలని పిలుపునిచ్చారు...

**మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...**

బీసీ ఉద్యమాన్ని అన్ని రంగాలలో ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో కొత్త ఉద్యోగ సంఘాలతో పాటు ప్రజాసంఘాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాదుల శ్రీనివాస్ గౌడ్, ఎర్ర సత్యనారాయణ, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కెవి గౌడ్, బత్తుల సిద్దేశ్వరులు, ఒంటెద్దు నరేందర్, దాసరి కిరణ్, బత్తిని కీర్తిలత, గోరా శ్యాంసుందర్, జర్నలిస్టు బాలాచారి, వసుమతి యాదవ్, కోట్ల వాసుదేవ్, చెన్నా శ్రీకాంత్, సంఘం సూర్యారావు, వాసు యాదవ్ లతో పాటు పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు..

# సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

(మొదటి తరువాయి)

తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన ఛీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు. సంప్రదాయం ప్రకారం సీజేఐ తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి పేరును సిఫార్సు చేస్తారు. ఆ లెక్కన జస్టిస్ డివై చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా అత్యంత సీనియర్‌గా ఉన్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా బార్ కౌన్సిల్ ఆఫ్ ఢిల్లీలో న్యాయవాదిగా 1983లో పేరు నమోదు చేసుకున్నారు. తీస్ హజారీ కోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. ఆ తరువాత ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగారు. 2004లో ఇన్‌కంటాక్స్ శాఖకు సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టులో ఎమికస్ క్యూరీగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలు అందించారు. ఆ తరువాత 2005లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా, 2006లో శాశ్వత న్యాయమూర్తిగా నియామితులయ్యారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ఢిల్లీ జ్యుడీషియల్ అకాడమీ ఛైర్మన్‌గా, ఢిల్లీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ ఇన్‌ఛార్జిగా కొనసాగారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఏ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించకుండానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఎలక్టోరల్ బాండ్స్, ఆర్టికల్ 370 తొలగింపు, సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ సంబంధిత కేసుల్లో జస్టిస్ సంజీవ్ ఖన్నా పాత్ర కీలకమైంది. కాగా నవంబరు 11న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటిరోజు అంటే నవంబరు 12న జస్టిస్ ఖన్నా సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఆరు నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. వచ్చే ఏడాది మే 13న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ చంద్రచూడ్ 2022 నవంబరు 9 న జస్టిస్ యూయూ లలిత్ స్థానంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల కాలంలో రెండేళ్ల పాటు సీజేగా ఉన్నది చంద్రచూడ్ మాత్రమే. అంతేకాదు, జస్టిస్ చంద్రచూడ్ తండ్రి జస్టిస్ విశ్వనాథ్ చంద్రచూడ్ సుప్రీంకోర్టు 16 ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అత్యధికాలం సీజేఐగా పనిచేసింది కూడా ఆయనే. ఏకంగా 7 సంవత్సరాల 139 రోజుల పాటు పదవీలో కొనసాగారు.

# మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

(మొదటి తరువాయి)

ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేమలఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్షరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

(మొదటి తరువాయి)




సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జూమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించుకున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# పకడ్బందీగా గ్రూప్- 1 పరీక్షలు

(మొదటి తరువాయి)

లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.

# మద్యం ధరలపై కన్నేసిన సర్కార్

(మొదటి తరువాయి)

చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం.

# జీవో నెంబర్ 29ని రద్దు చేయాలి



(మొదటి తరువాయి)

కోరారు. పాత జీవో 55 ప్రకారం పరీక్షల నిర్వహణ జరగాలన్నారు. పాత నోటిఫికేషన్ లో ఇచ్చిన 503 పోస్ట్‌లలో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వవద్దన్నారు. పెంచిన 60 పోస్ట్ ల్లో మాత్రమే కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా 503 పోస్ట్ ల్లో60 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది). జీవో 29 , రిజర్వేషన్ల అంశాల్లో కోర్టు కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించి పరీక్షలు పెట్టాలనిమహేష్ ను కోరారు. పాత నోటిఫికేషన్ ప్రకారమే రిజర్వేషన్లు, ఓపెన్ క్యాటగిరి ప్రకారం పరీక్షలు ఉండాలని అన్నారు. గ్రూప్స్ 1 అభ్యర్థుల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సమాచారం అందిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. సాయంత్రం వరకు దీనిపై తగిన సమాచారం ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. మరోవైపు కేటీఆర్ పై పీసీసీ చీఫ్ ఫైర్ అయ్యారు. మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేస్తారా..? అంటూ కేటీఆర్ కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని కేటీఆర్ ను విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో నే.. డీఎస్సీ.. వైద్యారోగ్యశాఖ లో ఉద్యోగాలు. గ్రూప్స్.. పోలీసు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మీరు ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఇకపోతే తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గ్రూప్ -1 అభ్యర్థులు సమావేశమయ్యారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేసేలా సర్కార్‌పై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌కు అభ్యర్థులు విన్నవించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సమస్యలను కేటీఆర్ విన్నారు. అయితే గ్రూప్-1 మెయిన్స్‌ను రీ షెడ్యూల్ చేయాలని గత కొద్ది రోజుల నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. కానీ కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదు. ఈ నెల 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. ఇదిలా ఉంటే ఈనెల 21 నుంచి జరిగే గ్రూప్-1 మెయిన్ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ గత రాత్రి వందలాది మంది అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసిన సంగతి తెలిసిందే.

## సంపాదకీయం

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ది చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ది చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్దతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమిక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ధి చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేడని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్దిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ది చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

# హర్యానా పాఠం అందకపోతే, 'మహా' ప్రమాదం!

మధ్యలో ఆటంకాలు వస్తాయేమో అని కొందరు పనులు మొదలు పెట్టనే పెట్టరట. వీళ్లు అధములట. మొదలుపెట్టాక, చిన్న విఘ్నం రాగానే తోకముడిచేవాళ్లుంటారు, వాళ్లు మధ్యరకం వాళ్లు. ఇక, ఆరునూరైనా అవరోధాలు ఎన్ని ఎదురైనా ఉత్తములు మాత్రం పనిపూర్తిచేస్తారట. భర్తృహరి నీతులు చాలా చెప్పాడు కానీ, పని మొదలుబెట్టి, చిన్న విజయం రాగానే అదే మహద్భాగ్యం అనుకుని, కాడిపడేసే వాళ్ల గురించి మాత్రం రాయలేదు. అప్పటికింకా కాంగ్రెస్ పార్టీ పుట్టలేదు కాబట్టి, ఆ బాపతు మనుషుల గురించి ఆ కవికి తెలియకపోయి కూడా ఉండవచ్చు. బుధవారం నాడు శ్రీనగర్‌లో ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారానికి హాజరయిన రాహుల్‌గాంధీని, ఆయన సోదరిని, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేని చూసినప్పుడు, వారి మీద అపారమయిన జాలి కలిగింది. మొన్నటి ఎన్నికల్లో వారికి దొరికింది ఒక పావుశేరు గెలుపు మాత్రమే. అంత మాత్రానికే వారి ముఖాలు వెలిగిపోతున్నాయి. హర్యానా జారిపోయింది. జమ్మూకశ్మీర్‌లో గెలుపు ఏదైనా ఉందంటే, అది కూడా నైతికమయిన గెలుపు, నేషనల్ కాన్ఫరెన్స్‌ది మాత్రమే. జమ్మూ ప్రాంతంలో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. కేంద్రపాలిత ప్రాంతం మొత్తం మీద బీజేపీ బాగా పుంజుకున్నది. ప్రభుత్వంలో చేరకుండా కాంగ్రెస్ కొంత పరువు దక్కించుకున్నది కానీ, ఆ ప్రభుత్వం మాత్రం ఏ పాటిది? గవర్నర్ కనుసన్నలలో వ్యవహరించవలసివచ్చే జీహుజూర్ సామంతం!మరి, ఈ కాంగ్రెస్ అల్పసంతోషులు రేపు మహారాష్ట్రలో గట్టి పోటీ ఇస్తారా? జార?ండ్‌లో తమ కూటమిని గెలిపించుకుంటారా? వచ్చే ఏటికి బిహార్‌లో బలపడతారా? లేక, భారం అంతా తమతో పాటు నడిచే మిత్రపక్షాల మీదికి తోసి, నిమ్మకు నీరెత్తుతారా? తమకు కాస్త బలం పెరిగేసరికి, ఏ పొత్తూ వద్దని ఫోజు కొట్టి, హర్యానాలో గర్వభంగం జరిగిన కాంగ్రెస్, మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీతో సవ్యంగా కలిసి నడుస్తుందా? పోయిన ఏడాది కర్ణాటకలో బీజేపీ మీద ముఖాముఖి ఘనవిజయం సాధించేసరికి కాంగ్రెస్ గాల్లో తేలిపోసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు, కాంగ్రెస్‌కు సానుకూలత కూడా పెరుగుతోందని తెలిసినా, పరిస్థితిని పూర్తి అనువుగా మలచుకోవడంలో అగ్రనాయకత్వం సమర్థత అంతంత మాత్రంగానే ఉండడంతో, బొటాబొటి మెజారిటీతో తెలంగాణలో అధికారం దక్కించుకుంది. వరుస బీజేపీ పాలనల తరువాత, ప్రత్యామ్నాయానికి సిద్ధంగా కనిపించినప్పటికీ, మధ్యప్రదేశ్ ఓటర్లను కాంగ్రెస్ ఆకట్టులేకపోయింది. ఇక రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లను వ్యతిరేక ఓటుతో పోగొట్టుకున్నది. పొడువు జోడో యాత్ర తరువాత, అడ్డంగా చేసిన న్యాయ యాత్ర ఫలితమో, ఓటర్లు ఉద్వేగాలను అధిగమించి వాస్తవ



జీవనసమస్యల మీద దృష్టి సారించారో లేదో కానీ, సాధారణ ఎన్నికల్లో, కాంగ్రెస్ తన బలాన్ని రెండింతలకు మించి పెంచుకుంది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకుండా, 240 దగ్గర నిలిపింది కానీ, ఎన్‌డీఏను, మోదీ మూడో రాకడను నిలవరించలేకపోయింది. యూపీ, మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీని నేరుగా దెబ్బతీయగలిగినందుకు బహుశా, కాంగ్రెస్ అధిష్ఠానం బాగా అలసిపోయి ఉంటుంది. ఇక చేయాల్సింది, 2029 దాకా వేచిచూడడం మాత్రమే. ఆ లోగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలన్నీ వరుసగా తన బుట్టలో పడవలసినవే అనే పగటికలల్లోకి విశ్రమించి ఉంటుంది. తన విజయం ఖాయమనుకుని ఆయుధాలు జారవిడవడం హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి ఒకానొక ముఖ్య కారణం. ఏకైక కారణం కాకపోవచ్చు. హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందని లోక్‌సభ ఎన్నికల సరళి చెప్పింది. రైతు ఉద్యమాల హోరు చెప్పింది. క్షేత్రస్థాయిపరిశీలనలు చేసిన మీడియా వ్యాఖ్యాతలు చెప్పారు. పోలింగ్‌కు ముందు సర్వేలు, తరువాత ఎగ్జిట్‌పోల్స్ చెప్పాయి. అయినా, ఫలితం మాత్రం బీజేపీ హ్యాట్రిక్. ఇప్పుడు నెపాన్ని అందరూ భూపిందర్ సింగ్ హుడా మీదకు నెట్టేయవచ్చు. విజయాన్ని అమిత్ షా వ్యూహరచనకు అంటగడుతున్నప్పుడు, ఓటమికి మాత్రం రాహుల్, ఖర్గే ఎందుకు బాధ్యులు కారు? ఇక్కడ సమస్య హర్యానాలో స్థానికంగా ఏ కారణాలు పనిచేశాయి, సామాజికవర్గాల ఏ కూడికలు, తీసివేతలు విఫలమయ్యాయి అన్నది కాదు. వేసుకోవలసిన ప్రశ్నలు ఇవి : హర్యానా విజయం తనకు అత్యవసరమని కాంగ్రెస్ ఎందుకు అనుకోలేదు? లోక్‌సభ ఎన్నికల్లో వ్యక్తమైన సానుకూలతను ఎందుకు జారవిడుచుకుంది? గెలిచే అవకాశం లేదని లోకం కోడై కూస్తున్నా, పట్టుదలగా బీజేపీ ఎట్లా గెలవగలిగింది? లోక్‌సభ ఎన్నికలలో నాలుగు మెట్లు కిందికి జారిన బీజేపీ, హర్యానా గెలుపుతో ఒక మెట్టు తిరిగి ఎక్కగలిగింది. ఈ విజయం, బీజేపీ శ్రేణులలో కొత్త ఉత్సాహం నింపుతోంది. ఎన్‌డీఏలో మిత్రపక్షాల ప్రాధాన్యాన్ని కుదించివేస్తోంది. మా ప్రాభవం తగ్గుతుందనుకుంటున్నారేమో, మళ్లీ మేం పూర్వ వైభవానికి వచ్చేస్తున్నాం.. అంటూ మిడిమిడి గెలుపులకే మూర్ఛపోయిన ప్రత్యర్థులను హెచ్చరిస్తోంది. తీసుకుంటే, హర్యానా ఫలితాల్లో కాంగ్రెస్‌కు తీవ్ర హెచ్చరిక దాగి ఉంది. ఆ ప్రమాదసూచిక ఒకరకంగా కాంగ్రెస్‌కు మేలుచేసేది, మేలుకొల్పేది! తప్పుల నుంచి నేర్చుకుని, దిద్దుబాటు చేసుకుంటుంది కాబట్టి బీజేపీ హర్యానాలో గెలిచింది అని కొందరు వ్యాఖ్యాతలు అంటున్నారు. అంత ఉదాత్తత ఆపాదించనక్కరలేదు కానీ, దారి సవరించుకునే పద్ధతి అయితే ఆ పార్టీకి ఒకటి ఉంది. ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చినప్పుడు, లోపం ఎక్కడ ఉందో కనిపెట్టి, విరుగుడు ప్రయోగించడంలో బీజేపీ వ్యూహకర్తలు దిట్టలు. ప్రజలలో వ్యతిరేకతకు కారణమైన విధాన నిర్ణయాలను వెనక్కి తీసుకుని, తిరిగి వారిని ఆకట్టుకునే ప్రయత్నం బీజేపీ పెద్దగా చేయదు. ఒక్క రైతు చట్టాల విషయంలో మాత్రమే వెనుకంజ వేసింది. అదొకటే మినహాయింపు. ప్రజల దృష్టి నుంచి ఆత్మవిమర్శ చేసుకోవడం బీజేపీకి అలవాటు లేదు. అమిత్ షా వంటి బీజేపీ పెద్దలు చేసే ప్రతిక్రియలు ప్రధానంగా సామాజిక సమీకరణాలకు సంబంధించినవి. జాట్ కులస్తులు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నారు కాబట్టి, జాటేతరులందరినీ తమ వైపుకుతిప్పుకోవడం బీజేపీ చేసింది. అటువంటప్పుడు, కాంగ్రెస్ ఏమి చేయాలి? తన వెనుక సమీకృతమైన జాట్ బలానికి తోడు, ఇతరులలో నుంచి కూడా గణనీయంగా రాబట్టుకోవాలి. దళిత నాయకురాలు శెల్జాను ప్రచారం నుంచి ఆమడదూరం పెట్టి కాంగ్రెస్ ఏ ఐక్యతను ప్రదర్శించగలిగింది? హర్యానాలో కూడా మతతత్వ వాతావరణం, దాన్ని మరింత ఉద్రిక్తం చేసిన సంఘటనల క్రమం ఉన్నది. కానీ, సాపేక్షంగాచూస్తే, బీజేపీ ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఆ రాష్ట్రంలో మతవిభజనను పెద్దగా ఉపయోగించుకోలేదు. కాకపోతే, తన పార్టీ వేదికల మీద నుంచి పదే పదే నిరసించే కులవిభజనను మాత్రం బాగా ఉపయోగించుకుంది. కాబట్టి, జాతీయస్థాయిలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఉన్న రాజకీయ సంవాదానికి హర్యానాలో ఆస్కారం లేకపోయింది. బీజేపీ ప్రతివ్యూహాన్ని అర్థం చేసుకోలేకపోవడం, సృజనాత్మకమైన పద్ధతులతో ప్రచారం నిర్వహించకపోవడం, సంప్రదాయ నాయకత్వాన్నే పూర్తిగా విశ్వసించడం కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. తన పునరుజ్జీవనంలో హర్యానా ఒక కీలకమయిన, ఆవశ్యకమైన మజిలీ అన్న స్పృహ కాంగ్రెస్ పెద్దలకు లేకపోవడం అన్నిటి కంటె ఎక్కువ చేటు చేసింది.

# రెండో కుర్చీ

కుర్చీలో కూర్చోవడం ఒక్కటే ముఖ్యం కాదు! కూర్చున్న కుర్చీలో కుదురుకోవడమే చాలా ముఖ్యం! ఇంత ముఖ్యమైన విషయాన్ని విస్మరించి ముందుకు పోవడం ఎవరికైనా ఎంతో కష్టమవుతుంది. ఈ కష్టాన్ని ముందే కనిపెట్టకపోతే ఎవరూ కార్యసాధకులు కాలేరు. ఈ ముందు జాగ్రత్త ఉంది కనుకనే ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ ఒక కొత్త సంప్రదాయానికి తెర తీశారు. ముఖ్యమంత్రి కుర్చీ పక్కనే రెండో కుర్చీని వేయించి ఇది తన అధినేత అయిన అరవింద్ కేజ్రీవాల్ కోసమని సెలవిచ్చారు. ఇక నుంచి తను భరతుని వలె పరిపాలన సాగిస్తానని ప్రకటించారు. మళ్లీ ఎన్నికలకు వెళ్లేంత వరకు ఈ నాలుగు నెలలూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. అంతేకాకుండా 'నన్ను సీఎంను చేసిన వ్యక్తిని సీఎంగా చేయడమే లక్ష్యంగా నేను పని చేస్తాను' అని ప్రతిన బూనారు. రాజకీయాలలో భక్తి కన్నా, భయం ఎక్కువ ప్రభావాన్ని చూపెడుతూ ఉంటుంది. అది కుర్చీ భయమే అయినట్లయితే ఇక అది మామూలుగా ఉండదు. ఆ భయం తాలూకు చర్యలు అనేక రూపాలలో బయిటకు వస్తుంటాయి. ఈ రెండో కుర్చీ వ్యవహారం కూడా అలాంటిదే అని గిట్టనివాళ్ళు గుసగుసలాడుతున్నారు. అయితే ఇల్లలుకగానే పండుగ అవుతుందా? కుర్చీలో కూర్చున్నంత మాత్రాన అంతా కులాసాగా సాగాలని గ్యారెంటీ ఉందా? ఒకవేళ అలా సాగాలని ఎవరైనా అనుకున్నా అలా సాగనిచ్చే వ్యవస్థ ఏదీ అక్కడ ఉండాలని లేదు కదా. కూర్చున్న వారిని చూసి కుతూహలపడే వారి కన్నా కుతకుతలాడే వాళ్ళ సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. కూర్చున్న దగ్గర నుంచి వాళ్లను కూలదోసే ప్రయత్నం చేసే వాళ్లు కూడా పెరుగుతూ పోతుంటారు. కుర్చీ మౌనంగానే ఉంటుంది. కూర్చునే వ్యక్తి కూడా మౌనంగానే ఉండొచ్చు. కానీ అందులో ఆ వ్యక్తిని ప్రశాంతంగా కూర్చోనిచ్చే వాతావరణమే



చుట్టుపక్కల ఉండదు. అదిగో ఆ వాతావరణ ప్రభావం నుంచి పుట్టుకు వచ్చిందే ఈ ఆలోచన అని గిట్టని వాళ్లు చెవులు కొరుక్కుంటున్నారు. ఈమెది భయాన్ని మించిన జాగ్రత్త అనీ, అదిగో ఆ జాగ్రత్త నుంచి పుట్టుకు వచ్చిందే రెండో కుర్చీ ఆలోచన అని కూడా అంటున్నారు. తన కుర్చీకి ప్రమాదం రాకుండా ఉండడం కోసమే ఆమె 'ఆయన' కుర్చీని ముందుకు తీసుకువచ్చారని ఒక పుకారును పుట్టించి దట్టించి మరీ దేశం మీదకి వదిలేశారు. ఇది పైకి అధినేతపై భక్తి లాగా కనిపిస్తున్నప్పటికీ సారాంశంలో తన పదవికి ఎలాంటి ఢోకా లేకుండా చేసుకొనేందుకు చేపట్టిన ఇజ్రాయెల్ వాడిన 'ఐరన్ డోమ్' వంటి గట్టి భద్రతా వ్యవస్థ అనే అభిప్రాయాన్ని కూడా ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఇక నుంచి తన పైకి ప్రత్యర్థులు విసిరే రాజకీయ క్షిపణి దాడులన్నిటినీ కూడా తాను అధినేతకు వేసిన రెండో కుర్చీ అడ్డుకుంటుందని ఆమె నమ్మకమై ఉంటుంది! ఆతిశీ చేసిన ఈ చర్య మనకు తమిళ రాజకీయాలను తలపునకు తెస్తున్నదికదూ! జయలలిత జైలుకు వెళ్ళిన ప్రతిసారీ అధికారాన్ని తన అనుంగు శిష్యుడు పన్నీరు సెల్వానికి అప్పగించడం- ఆయన కన్నీరు పెడుతూ ఈ కార్యాన్ని భుజాన వేసుకోవడం- మళ్ళీ 'అమ్మ' జైలు నుంచి బయటకు రాగానే పదవికి పన్నీరు పూత పూసి ఆమెకు పువ్వుల్లో పెట్టి మరీ అప్పగించడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఏలుకోరా నాయనా అంటే ఈ ఏడుపు ఎందుకని అప్పుడు చాలా మంది ఆశ్చర్యపోయేవారు. కానీ ఆ ఏడుపు వెనక ఆతిశీకి ఉన్నటువంటి రెండో కుర్చీ లాంటి ఆత్మరక్షణ చర్యలు ఏవీ తనకు లేకపోయెకదా అనే బయటికి కనిపించని బాధ ఏదో ఆయనకు ఎంతో కొంత ఉండే ఉంటుంది. ఈ పదవి 'మూడు, నాలుగు నెలల' ముచ్చటే కదా అనే ఆయన ఆత్మఘోష అటువైపు చెవి యొగ్గి విన్నవాళ్లకు తప్ప ఇతరులెవరికీ వినిపించే అవకాశం లేదు. ఆతిశీ చేసిన రెండో కుర్చీ ప్రయోగం 'ఆప్' వర్గాలకు నచ్చితే నచ్చవచ్చు, కానీ అందరికీ ఎందుకు నచ్చుతుంది చెప్పండి? అందుకే ఆమె భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించింది అని కమలనాథులు ధ్వజమెత్తారు. అంతేకాకుండా రెండో కుర్చీ రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రకటించేశారు. దీనికి ప్రతిగా ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు ప్రతిదాడికి పూనుకున్నాయి. డబుల్ ఇంజన్ సర్కార్లు అవసరం అంటున్న చోట%-% డబుల్ కుర్చీ సర్కారు ఎందుకు ఉండకూడదని ఎదురు ప్రశ్నలు గుప్పించాయి. ఖాళీ కుర్చీ కనిపిస్తే ఎవరో ఒకరు కూర్చుంటారు. అట్లాంటిది అధికారంతో కూడిన ఖాళీ కుర్చీ కనిపించాక ఇక ఊరుకుంటారా? ఆ ఖాళీని పూరించేంత వరకు వాళ్లు ఎదుటివారికి ఖాళీ సమయాన్ని లేకుండా చేసేందుకే ముమ్మర ప్రయత్నం చేస్తారు. భారతీయ జనతాపార్టీ ఢిల్లీ శాఖ ఇక నుంచి ఆ పనిమీదే ఉండబోతోంది. వారికి భాజపా హై(పై)కమాండ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయి మరి!

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక
5
హైదరాబాద్
శుక్రవారం
అక్టోబర్ 18-10-2024
www.journalistdiarytelugu.com

# మహా ఉద్యమాల పార్టీ బీఎస్పీ

- రంగారెడ్డి జిల్లా బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ కి ఘనంగా సన్మానం



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
బీఎస్పీ పార్టీ అంటేనే మహా ఉద్యమ పార్టీ అని రంగారెడ్డి జిల్లా ఇంచార్జిగా దొడ్డి శ్రీనివాసులు అన్నారు. గురువారం షాద్ నగర్ నియోజకవర్గం బీఎస్పీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమమని పట్టణంలోని దేవీ గ్రాండ్ హొటల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలు నాయకులు శాలువా పూలమాలతో జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు తమ తమ అభిప్రాయాలను సమస్యలను జిల్లా ఇన్చార్జి దొడ్డి శ్రీనివాసులకు తెలియజేశారు. షాద్నగర్ నియోజకవర్గం లోని బీఎస్పీ పార్టీ బలోపేతం చేయాలని ప్రతి గ్రామంలోని బీఎస్పీ పార్టీకి సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీఎస్పీ పార్టీ అంటేనే ఉద్యమాల పార్టీ అన్నారు. మహనీయులు, మహానుభావులు నిర్మించిన బీఎస్పీ పార్టీ బడుగు బలహీన వర్గాల అండగా ఉంటుందని పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రతిఫలం దక్కుతుందన్నారు. బీఎస్పీ పార్టీ అంచెలంచెలుగా ఎదుగుతుందన్నారు. ఇతర పార్టీల నుంచి బీఎస్పీ పార్టీ వైపు ముగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా కార్యదర్శి గుండేటి నర్సింలు, నియోజకవర్గ బీవీఎఫ్ కో కన్వీనర్ అంతారం శ్యామ్, ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు తుప్పరి కుమార్, కేశంపేట్ మండల అధ్యక్షులు సొంటి శ్రీనివాస్, కేశంపేట మండల ఉపాధ్యక్షులు అబ్బి జగన్, కొత్తూరు మండల అధ్యక్షులు ఎర్రోళ్ల కృష్ణ, చౌదర్ గూడా మండల సీనియర్ నాయకులు చెన్నయ్య, ఫరూక్ నగర్ మండల కార్యదర్శి శివగల్లా ఆంజనేయులు, ఫరూక్ నగర్ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ కొండేటి మహేందర్, ఫరూక్ నగర్ మండల సీనియర్ నాయకులు అశోక్, ఎగిరే సుదర్శన్, శరత్, వెల్ జర్ల గ్రామ అధ్యక్షులు మల్లేష్, కమ్మదనం గ్రామ అధ్యక్షులు జై ప్రకాష్, రాజు, అజయ్, కృష్ణయ్య, లింగారం లక్ష్మయ్య, శ్రీనివాసులు, సుదర్శన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి అందరికీ ఆదర్శం

వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, గద్వాల నియోజకవర్గ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
రామాయణ రచయిత వాల్మీకి మహర్షిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ జెడ్పీ చైర్ పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య అన్నారు. ధరూర్ మండలం ద్యాగదొడ్డి గ్రామ వాల్మీకి యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సాహిత్యానికి ఆద్యుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామాయణాన్ని అందించిన వాల్మీకి అడుగుజాడల్లో అందరం పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి యువజన సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సుధాకర్, గ్రామస్తులు పెద్ద సౌరన్న, చిన్నసౌరన్న, బెల్లం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ నేత ఉమ్మెంత్యాల శ్రీనివాస్ రెడ్డికి పితృ వియోగం

- పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, సీనియర్ నేత కాశీనాథ్ రెడ్డి



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన సీనియర్ నేత శ్రీనివాస్ రెడ్డి తండ్రి రాంరెడ్డి ఆకస్మిక మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నేత తాండ్ర కాశీనాథ్ రెడ్డి గురువారం కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల గ్రామంలో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి శ్రీనివాస్ రెడ్డికి ధైర్యాన్ని చెప్పారు. రాంరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాశీనాద్ రెడ్డి, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ అధ్యక్షులు నరేష్ రాథోడ్



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
విద్యా సంవత్సరం మొదలై నాలుగు నెలలు నిండిన గానీ ఇప్పటి వరకు విద్యార్థులకు వారి రూల్ నంబర్లలను పాఠ్యపుస్తకాలు ఇంకా అందించలేరని ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ అధ్యక్షులు నరేష్ రాథోడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘోరంగా గతంలో కన్నా ఈ విద్యా సంవత్సరం విద్యార్థి ఫీజులను ఏకంగా రూ.500 రూపాయలు పెంచడం సరికాదన్నారు. బిఏ, బీకాం, బీఎస్సీ, బిజెడ్ సి, గ్రూపు విద్యార్థులకు ఏకంగా ట్యూషన్ ఫీజులు, స్పెషల్ ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, ఎగ్జామ్స్ ఫీజులు అని విద్యార్థుల నుంచి వేలకు వేలల్లో ఫీజులు వసూలు చేయడం అన్యాయమని అన్నారు. గత సంవత్సరంలో విద్యార్థులు అప్లై చేసుకున్న స్కాలర్షిప్ బకాయిలు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా, ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలను నెరవేర్చకపోతే విద్యార్థి లోకంతో ఎమ్మెల్యే క్యాంపు ముట్టడి చేస్తామని షాద్ నగర్ ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు నరేష్ రాథోడ్ అన్నారు.

## వేదమంత్రోచ్చరణలతో శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టాపన





- భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి
- ప్రత్యేక పూజలు చేసిన కమిటీ సభ్యులు, భక్తులు

**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో వేద మంత్రోచ్చరణలతో శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో గురుస్వామి గిరీషన్ నాయర్, కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య, వెంకట్రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భగవంతుని నామస్మరణతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం స్వామివారిని అర్చకులు రవి శర్మ, సంతోష్ శాస్త్రీ, సునీలా చార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించిన దాతలు ఈశ్వరప్ప, రేటికల్ చంద్రకాంత్, మేకల సత్యనారాయణ, మేకల రామచంద్ర రెడ్డి, మేకల దేవేందర్ రెడ్డి, పోతు రమేష్, పలబట్ల సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో నక్కల వెంకటేష్ గౌడ్, పినపాక ప్రభాకర్, సతీష్, ఎడ్ల ప్రభాకర్, కాట లింగమప్ప, పోతు కృష్ణయ్య, కడియాల శివయ్య, అమర్ నాథ్, విక్రంరెడ్డి, రోళ్ల అంజయ్య, శేఖర్ రెడ్డి, ఆగీరు అనిల్, ఇప్పలపల్లి నర్సింహా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి ఒకరు మృతి





**చిన్నచింతకుంట ,అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**
ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వర్నె గ్రామానికి చెందిన అంజన్న, కురుమన్న, కురుమన్నలు ముగ్గురు కలిసి కొంకనోని పల్లి గ్రామానికి ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఉంద్యాల గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. అంజన్న తలకు బలమైన గాయం అదేవిధంగా తీవ్ర రక్తస్రావము కావడంతో పేరూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పేరూరు ఆస్పత్రి నందు చనిపోయాడు. మిగతా ఇరువురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య 5 మంది ఆడపిల్లల సంతనం కలదు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించి దర్యాప్తు చేపట్టినట్లు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## వైభవంగా శ్రీ వాల్మీకి మహర్షికి జలాభిషేకం



**చిన్న చింతకుంట,అక్టోబర్17 (జర్నలిస్టు డైరీ)**
శ్రీ సీతారాముల జీవితాన్ని రామాయణ కావ్యంతో ప్రపంచ మానవాళికి అందించిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో వాల్మీకి బోయ కులస్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ వాల్మీకి మహర్షి దేవాలయంలో శ్రీ వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కృష్ణా నది నుంచి తెచ్చిన పవిత్ర జలాలను గ్రామ సమీపంలోకి రాగానే మంగళ వాయిద్యాలు, మహిళల మంగళహారతులతో ఘన స్వాగతం పలుకుతూ అక్కడి నుంచి పవిత్ర జలాల శోభాయాత్ర పురవీధుల గుండా కొనసాగింది. అడుగడుగునా భజన కీర్తనలు, మహిళల బొడ్డెమ్మలు, చిన్నారుల కోలాటాలతో ఎంతో ఆహ్లాదకరంగా శోభయాత్ర జరిగింది. శ్రీ వాల్మీకి దేవాలయానికి పవిత్ర జలాలను చేర్చారు. అక్కడ వేద పండితులు శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహానికి పవిత్ర జనాలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి అఖండ భజనలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను వాల్మీకి బోయ కులస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానాలు ఏర్పాటు చేశారు.

# కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం

– ఏర్పాట్లపై ఎమ్మెల్యే, అన్ని శాఖల అధికారులతో కలిసి సమీక్ష ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి







**చిన్నచింతకుంట, అక్టోబర్ 17 (జర్నలిస్టు డైరీ)**

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 18 వరకు నిర్వహించనున్న శ్రీ కురుమూర్తి స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డి అధికారులను కోరారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 18 వరకు నిర్వహించనున్న కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయ ఆవరణలో అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత జరిగే పెద్ద జాతర అని అన్నారు. ముఖ్యంగా ఉద్దాల ఉత్సవం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది దానికి అనుగుణంగా అధికారులు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలోని వివిధ రూట్ ల నుంచి వచ్చే భక్తులకు ఆర్టీసీ బస్సులను సరిపడా ఏర్పాటు చేయాలని అన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రిపేర్ లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యపై శ్రద్ధ వహించాలని అన్నారు. కోనేరు లో నీటిని ఎప్పటికప్పుడు శుభ్ర పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై ఈ నెల 5 న జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగిందని, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను వివిధ కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆయా కమిటీలు వారికి కేటాయించిన విధులను తూచ తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన రోజులలో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకుగాను ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, ఈ కంట్రోల్ రూమ్ లో 24 గంటలు పనిచేసే విధంగా షిఫ్ట్ పద్ధతిలో సిబ్బందిని నియమించాలని, ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే తక్షణమే కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని ఆదేశించారు. ఉత్సవాలు నిర్వహించినన్ని రోజులు తాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరా, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అవసరమైతే పారిశుద్ధ్య నిర్వాహణ కోసం పక్క గ్రామాలు, మున్సిపాలిటీ నుంచి సిబ్బందిని నియమించాలని చెప్పారు. తగినన్ని అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాలలో ప్రజల ఆరోగ్యం కోసం ప్రథమ చికిత్సతో పాటు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. అన్ని ప్రాంతాల నుంచి తగినన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించగా, బ్రహ్మోత్సవాలు నిర్వహించే ఆవరణలో వాహనాల పార్కింగ్, బారికేడింగ్, సైన్ బోర్డుల వంటివి సరిగా నిర్వహించాలని, రహదారులు పాడైన చోట మరమ్మతులు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలలో మద్యం అరికట్టడంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందాలను నియమించాలని తెలిపారు. ఆహార పదార్థాలు కల్తీ జరగకుండా ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఎస్పీడీ జానకి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ తరపున ఎటువంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు షీ టీమ్ లు ఏర్పాటు చేయనున్నట్లు, గతంలో జరిగిన పొరపాట్లు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. తొలుత శ్రీ కురుమూర్తి వేంకటేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆలయ సంప్రదాయం, మర్యాదలతో స్వాగత పలికారు. అనంతరం దేవాలయం ప్రాంగణంలో, కోనేరు వద్ద జాతర ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తదితరులు వారి శాఖల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలపై వారి కార్యాచరణ ప్రణాళికను వివరించారు. కాగా శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ఎమ్మెల్యే, కలెక్టర్ విజయేంద్ర బోయి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీఓ నవీన్, దేవస్థాన చైర్మెన్ గోవర్ధన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పద్మ, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డిపిఓ పార్థ సారథి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్ రెడ్డి, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధునేశ్వర్ రెడ్డి, చిన్న చింతకుంట మండల స్పెషల్ ఆఫీసర్ డివైఎస్ఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ మహబూబ్ నగర్, వనపర్తి ఎస్ఈలు జగన్ మోహన్, వెంకట రమణ, ఈఈ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి సర్వే

– కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సర్వే

**వనస్థలిపురం, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

ట్రాఫిక్, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులతో విజయవాడ జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సర్వే చేశారు. సులభంగా రోడ్డు దాటేందుకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి ఎంవీఆర్ కాంట్రాక్టర్ కి వివరించారు. రూ.40 కోట్ల నిధులతో నిర్మించే అండర్ పాసులను మల్కాజ్ గిరి పార్లమెంట్ – ఎల్బీనగర్ ప్రజలు ఇబ్బందులు పడకుండా పిల్లర్స్ తో ఫ్లైఓవర్లు నిర్మించాలని, దానికి రూ.350 కోట్లు మంజూరు చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ ఈటెల రాజేందర్ ను కలిసి కోరారని తెలిపారు. అదేవిధంగా మన్సూరాబాద్, హయత్ నగర్, వనస్థలిపురం, భగ్యలత ప్రధాన ప్రాంతాలు కాబట్టి రోడ్డు దాటే ప్రజలకు ఇబ్బంది కావద్దని మంత్రికి ఈటల వివరించడంతో గురువారం ఎంవీఆర్ కాంట్రాక్టర్ కు అధికారులు, పోలీస్ అధికారులు సర్వే నిర్వహించారని కొప్పుల చెప్పారు.





**ఈటెల చొరవతో...**

ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్ట్ తో కూడిన నిర్మాణం కోసం భాగ్యలత సీఆర్ఐడీఏ ముందు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు లెక్చరర్స్ కాలనీ ముందు బ్రిడ్జీలను ఏర్పాటు చేసేందుకు సర్వే చేసి నిర్ణయించారు. అండర్ పాస్ ఫ్లైఓవర్లు తక్కువ బడ్జెట్ తో నిర్మించడంతో స్థానికులకు, వ్యాపారస్తులకు చాలా ఇబ్బంది కలుగుతుందన్నారు. పనామా వనస్థలిపురం వద్ద పిల్లర్ ను నిర్మించొద్దని జూన్ 25 న తాను స్వయంగా బీజేపీ నాయకులతో కలిసి అడ్డుకున్నానని ఆయన తెలిపారు. ఎంపీ ఈటెలకు చెప్పిన నుంచి తన ప్రత్యేక చొరవతో ఇప్పటికీ రెండు మూడుసార్లు కేంద్ర మంత్రిని కలిసి రూ.40 కోట్లతో ఉన్న నిధులను రూ.300 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ నవీన్ రెడ్డి, సీఐ భూపతి గట్టుమల్లు, డీఈ వెంకటేశ్వర రెడ్డి, ఏఈ శరత్ పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు తాళలేక హోంగార్డు మృతి

**షాద్‌నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**



ఆర్థిక ఇబ్బందులు తాళలేక హోంగార్డు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం.. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి వెంకట్ రెడ్డి నగర్ లో నివాసం ఉండే వెంకట రమణయ్య(39) హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పోగొట్టుకున్న పోన్ లు అందచేత



**(జర్నలిస్ట్ డైరీ) నర్సింహులపేట**

ఇటీవల కాలంలో పోగొట్టుకున్న విలువైన ఫోన్లను బాధితులకు అందజేసినట్లు నర్సింహులపేట ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... మండలంలోని కొంతమంది తమ ఫోన్ లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా పోలీసు వారు సెయిర్ అనే వెబ్సైట్ ద్వారా ఫోన్లను వెతికి ఈ రోజు ఐదు ఫోన్ లను బాధిత వ్యక్తులకు అందించడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ విజయ్ లను పలువురు అభినందించారు.

# రాష్ట్ర డీజీపీ జితేందర్ ను కలిసిన మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

– బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని డీజీపీకి వినతి



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

అకారణంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి గురువారం రాష్ట్ర డిజిపి జితేందర్ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ నాయకుల బృందంతో కలిసి డీజీపీకి వినతి పత్రం అందజేసి బీఆర్ఎస్ కార్యకర్తల పట్ల పోలీసులు వివరిస్తున్న తీరును వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీలు తమ వాయిస్ ను వినిపించవలసి ఉంటుందని, ప్రతి చిన్న విషయంపై కార్యకర్తలను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు యాదగిరిలతో కలిసి డీజీపీకి వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

# దుర్గమ్మ టీచర్ దినకర్మలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

షాద్ నగర్ పట్టణంలో దుర్గమ్మ టీచర్ కు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆమె వద్ద అనేకమంది విద్యార్థులు చదువుకొని భవిష్యత్తులో ఎంతో ఉన్నత రంగాల్లో ప్రస్తుతం ఉన్నారు. ఆమెకు ఉన్న ఇద్దరు కొడుకులు ఒకరైన ఫణి కుమార్ ఒకప్పటి వార్త దినపత్రిక పాత్రికేయునిగా పేరుగాంచి ప్రస్తుతము వ్యాపార రంగంలో అత్యున్నత అభివృద్ధిలో ఎదుగుతున్నాడు. మొన్నీమధ్యనే దుర్గమ్మ టీచర్ మృతి చెందడంతో షాద్ నగర్ పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. గురువారం ఆమె దినకర్మ జరుపగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె దినకర్మకు హాజరైన ప్రజానీకం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని చూసి నవీన్ రెడ్డి ఆల్వేస్ నవీన్ రెడ్డి అంటూ, పట్టణంలో తనను పిలిచిన ప్రతి కార్యక్రమానికి హాజరవుతూ పట్టణ ప్రజల మనసులు చూరకొంటున్నాడని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# నందిగామలో ఘనంగా పోచమ్మ బోనాలు



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

నందిగామ మండల కేంద్రంలో గ్రామ దేవతల విగ్రహాలు పునః ప్రతిష్టాపనలో భాగంగా గురువారం గ్రామస్థులు పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేధ్యాన్ని బోనంగా తలపై ఎత్తుకుని డప్పు, బ్యాండు బజాలతో, శివ సత్తుల ఆటపాటలతో పోచమ్మ తల్లికి బోనం సమర్పించడానికి మహిళలు, గ్రామస్థులు భారీగా తరలివెళ్లారు.

# కొందుర్గ్ మండల కేంద్రంలో వాల్మీకి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు

– కార్యక్రమంలో పాల్గొన్న కొందుర్గ్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్



**షాద్ నగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ)**

కొందుర్గు మండల కేంద్రంలో ఈ నెల 13 నుంచి ప్రారంభం అయిన టోర్నమెంట్ గురువారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఫైనల్ పోటీలో ఢిల్లీ జట్టు, ముంబై జట్టు పై 7 వికెట్ల తేడాతో తలపడి చెన్నై జట్టు విజేతగా నిలిచింది. ముంబై జట్టు 48 అల్ అవుట్, చెన్నై జట్టు 49/3, విజేత కు మొదటి బహుమతిగా ట్రోఫీ, ఇరవై వేల రూపాయల నగదును కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అందించారు. రెండవ బహుమతి రూ.పది వేల నగదును జిబి కృష్ణ అందించారు.

# చాతి నొప్పితో ఆస్పత్రికి వచ్చిన వ్యక్తి మృతి

- ఆపరేషన్ చేసిన కొన్ని గంటలకే మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబికుల ఆరోపణ
- అస్పత్రి ముందు బంధువుల బైఠాయింపు



ఎల్బీనగర్, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ) : చాతి నొప్పితో ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. ఈ దారుణం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓజోన్ ఆస్పత్రిలో జరిగింది. వైద్యం కోసం వస్తే ప్రాణాలు పోయాయని కుటుంబీకులు తల్లడిల్లారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ముత్యాలమ్మ గూడెంకు చెందిన నిమ్మనగొని నరసింహ(45) రామంతాపూర్ శ్రీ నగర్ కాలనీలో భార్య పిల్లలతో నివాసిస్తున్నాడు. అతను వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబికులకు చెప్పడంతో కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్ లో సోమవారం బంధువులు చేర్పించారు.

**-చికిత్స చేయకుండా...**

వైద్యులు యాంజియోగ్రామ్ నిర్వహించి గుండెకు స్టంట్ వేయాలని చెప్పారు. అందుకు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. తమ వద్ద అంత డబ్బులు లేదని, ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయాలని వైద్యులకు కుటుంబీకులు చెప్పారు. దాంతో వైద్యులు ఆరోగ్యశ్రీ అప్రూవల్ కోసం పంపించారు. ఆస్పత్రి యాజమాన్యం రెండు రోజులుగా చికిత్స చేయకుండా నిర్లక్ష్యం వహించిందని వారు తీవ్రంగా ఆరోపించారు. అనంతరం ఆరోగ్యశ్రీ అప్రూవల్ వచ్చినట్లు బుధవారం తెలిపారు. అదేరోజు ఆపరేషన్ చేశారని.. ఆపరేషన్ తర్వాత అంతలోనే సాయంత్రం 5 గంటల తర్వాత అతనికి తీవ్ర గుండెనొప్పి వచ్చి మృతిచెందాడని వైద్యులు చెప్పినట్లు నరసింహ బంధువులు ఆరోపించారు.

**అత్యవసరం కాకపోవడం...**

మృతిని కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం చేయాలని ఆస్పత్రి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ ఘటన గురించి హాస్పిటల్ యాజమాన్యాన్ని వివరణ కోసం సంప్రదించగా అందుబాటులో రాలేదు. ఆరోగ్యశ్రీ వారిని అడగడంతో సోమవారం యాంజియోగ్రామ్ నిర్వహించారని తెలిపారు. అత్యవసరమైతే టెలికాల్ ద్వారా ఆరోగ్యశ్రీ అప్రూవల్ తెప్పించుకునేవారని పేర్కొన్నారు. అత్యవసరం కాకపోవడం వల్లనే రెండురోజులు వేచి ఉన్నారని, ఆ విషయం వైద్యులకు తెలుసని వాళ్లు సమాధానమిస్తూ వివరించారు. 100 నంబర్ ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలి

– కార్పొరేటర్ లచ్చి రెడ్డి



వనస్థలిపురం, అక్టోబర్ 17 (జర్నలిస్ట్ డైరీ) శివారు ప్రాంతాల్లోని అన్ని కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ నూతన పైప్ లైన్ కోసం నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. జలమండలి ఎండీని గురువారం కలిసి వినతపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం చేపట్టలేకపోతున్నామని తెలిపారు.

**పన్నులు కడుతున్నా...**

రోడ్లపై వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తిరగలేని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. ప్రతి నెల సెప్టిక్ ట్యాంకుల పరిశుభ్రం కోసం రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చు వస్తుందన్నారు. సామాన్యులు శుభ్రం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఎండీకి వివరించారు. ప్రజలు ఇళ్లు నిర్మించుకునే సమయంలో పర్మిషన్ల కోసం, రూ.లక్షల్లో పన్నులు కడుతున్నారని గుర్తు చేశారు. కావున కనీస మౌలిక వసతులు కల్పించాలని, అందులో భాగంగా భూగర్భ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## గుడుంబా స్థావరాల పై దాడులు



(జర్నలిస్ట్ డైరీ) -నర్సింహులపేట

నర్సింహులపేట మండలం లోని రూప్ల తండ లో గురువారం జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ ఆదేశాల మేరకు ఎస్సై మాలోత్ సురేష్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలువురు పై కేసు నమోదు చేసి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా రూపొందించడానికి పోలీసులు చేపట్టిన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. గుడుంబా వల్ల కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



(జర్నలిస్ట్ డైరీ) ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం

లవైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలకు త్వరలోనే పరిష్కార మార్గాలు చూపుతానని సానుకూలంగా స్పందించినారని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో సింగరేణి మండలానికి సింగరేణి నుండి రావలసిన షేప్ నిధులు, సింగరేణి మండలానికి డిగ్రీ కాలేజీ, గ్రామాలలో మౌలిక సదుపాయాల నిమిత్తం ప్రత్యేక నిధుల కేటా ఇస్తామన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

## ఆకస్మికంగా మృతిచెందిన ఉపాధి హామీ టీఏ కిరణ్ కుమార్



(జర్నలిస్ట్ డైరీ) ఆలేరు ఆర్సీ :

వికారాబాద్ జిల్లా తాండూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం టీఏ కిరణ్ కుమార్ ఆకస్మికంగా మృతి చెందినారు. మృతుని ఆత్మకు శాంతి కలగాలని ఆత్మకూరు(ఎం) మండల ఉపాధి హామీ పథకం సిబ్బంది కార్యాలయం ముందు మృతుని చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించినారు.

## కలిసిరాండీ.. మానవ అక్రమ రవాణాను అరికడదాం....!!









-సరూర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాచకొండ ఏహెచ్‌టియూ అవగాహన సదస్సు

సరూర్ నగర్, అక్టోబర్ 17(జర్నలిస్ట్ డైరీ) మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో యువత పాత్ర ఎంతో కీలకమని, పాఠశాల విద్యా దశ నుండే విద్యార్థిని విద్యార్థులకు సామాజిక అవగాహన అవసరమని రాచకొండ ఏహెచ్‌టియూ ఎస్సై రాములు తెలిపారు. గురువారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎల్బీనగర్ డిసిపి జోన్ సరూర్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశానుసారం, రాచకొండ యస్.ఓ.టి. డి.సి.పి. మురళిధర్ సూచనల మేరకు ఏహెచ్‌టియూ రాచకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ ఏహెచ్‌టియూ ఎస్సై రాములు, మహిళా ఎస్సై అనురాధ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినది. అనంతరం ఎస్సై రాములు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానములో ఉందని అత్యంత ప్రమాద గటికలను మోగిస్తుందన్నారు. చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్, బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్, టీ-సేఫ్టీ అప్లికేషన్ పైన అవగాహనా కల్పిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఏఎస్సై అనురాధ మాట్లాడుతూ.. మహిళలకు కొత్తగా పొందుపర్చిన చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. మహిళలు ఒంటరిగా ఆటోలలో, బస్సులలో ప్రయాణిస్తున్నపుడు ఏదైనా అనుమానంగా అనిపిస్తే డయల్ 100 ను సంప్రదించాలని సూచించారు. మహిళలు పలు జాగ్రతలు పాటించి ధ్యైర్యంగా ముందుకు సాగి ఎట్టి పరిస్థితి లోను ఎవరికీ కూడా భయపడకుండా ఎవరికి లొంగకుడదని తెలిపారు. ఒకవేళ సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలకు గురి అయితే సైబర్ క్రైమ్స్ డయల్-1930 ఉమెన్ హెల్ప్ లైన్-1091 181, చైల్డ్ హెల్ప్ లైన్-1098/112, డయల్-100, రోడ్ సేఫ్టీ ముందు జాగ్రత్త తదితర చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గాలి కుంటు నుంచి పశువులను కాపాడుకోండి



(జర్నలిస్ట్ డైరీ) ప్రతినిధి జఫర్గడ్:

గాలి కుంటు వ్యాధి భారీ నుంచి పాడి రైతులు తమ పశువులను కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.వై. రాధాకిషన్ అన్నారు . మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన ఆయన సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ డి. సారంగపాణి, మండల పశు వైద్యాధికారి డా సిహెచ్ రజిత, వెటర్నరీ అసిస్టెంట్ మంజుల, గోపాల మిత్రలు రాజు, సీహెచ్ నగేష్ తదితరులు పాల్గోన్నారు.

## సిఐ సోలోమన్ రాజుని సన్మానించిన కొరటికల్ మాజీ సర్పంచ్లు



(జర్నలిస్ట్ డైరీ) ఆలేరు ఆర్సీ :

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్లు కోల సత్తయ్య గౌడ్, కొడిమాల యాదగిరి గౌడ్, కొరటికల్ పాల సంఘం మాజీ చైర్మన్ చామకూర వెంకటయ్య తదితరులు పాల్గొని మండలం కేంద్రానికి నూతనంగా వచ్చిన సిఐ సోలోమన్ రాజుని కలిసి శాల్వ కప్పి సన్మానించినారు.



## తగ్గేదేలే.. 'పుష్ప ది రూల్' నుంచి అల్లు అర్జున్ కొత్త పోస్టర్

నేషనల్ అవార్డు విన్నర్, టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్‌కు క్రేజీ అప్‌డేట్ వచ్చింది. మరో 50 రోజుల్లో 'పుష్ప ది రూల్' కౌంట్‌డౌన్ షురూ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇక 'పుష్ప 2' విడుదలకు ఇంకా 50 రోజులు మాత్రమే ఉన్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. అయితే ఈ సినిమాను ప్రీ పోన్ చేసి డిసెంబర్ 05న విడుదల చేయనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.




## డియర్ స్టూడెంట్స్'తో వస్తున్న నయనతార

లేడీ సూపర్‌స్టార్ నయనతార వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'టెస్ట్ , 'మన్నాన్‌గట్టి 1960' చిత్రాలు పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం 'డియర్ స్టూడెంట్స్'తో సినిమాతో బిజీ కానుంది. ఇటీవల చిత్ర బృందం ఆమెను సెట్‌లోకి ఆహ్వానించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నయన్ ఓ ఫొటో షేర్ చేశారు. కాలేజీ స్టూడెంట్స్ చుట్టూ తిరిగే ఈ వినోదాత్మక చిత్రాన్ని సందీప్ కుమార్, జార్జ్ ఫిలిప్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. నివిన్ పౌలీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'లవ్ యాక్షన్ డ్రామా' చిత్రం తర్వాత నివిన్, నయన జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో నయన విద్యా రుద్రన్ అనే టీచర్‌గా కనిపించనున్నటు సమాచారం. ప్రస్తుతం నయన జాబితాలో 'అమ్మోరు 2', 'తని ఒరువన్ 2' చిత్రాలున్నాయి.గతేడాది జవాన్, ఇరైవన్, అన్నపూర్ణ చిత్రాలతో అలరించారు నయన్.



## అభిమానులకు కిక్ ఇచ్చే న్యూస్ చెప్పిన నిధి అగర్వాల్..

అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది నిధి. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత అక్కినేని అఖిల్ తో మజ్ను అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా నిరాశపరిచింది. దాంతో ఈ బ్యూటీకి ఇక అవకాశాలు రావడం కష్టమే అని అనుకున్నారు అంతా.. ఆతర్వాత డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాలో నటనతో పాటు గ్లామర్ పరంగాను ఆకట్టుకుంది.డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నిధి అందాలకు కుర్రకారు ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ అయినా కూడా నిధికి అంతగా ఆఫర్స్ రాలేదు. మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరో అశోక్ గల్లా నటించిన హీరో అనే సినిమా చేసింది. ఇక ఇప్పుడు ఈ భామ వరుసగా రెండు భారీ సినిమాలు చేస్తోంది. కెరీర్ ఖతం అయ్యింది అని అనుకునేలోగా ఇద్దరూ బడా స్టార్స్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. నిధి అగర్వాల్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న హరిహరవీరమల్లు సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది. అలాగే ప్రభాస్ మారుతి దర్శకత్వంలో వస్తున్న రాజా సాబ్ సినిమాలోనూ నటిస్తుంది. తాజాగా ఈ రెండు సినిమాల్లో నటించడం గురించి తాజాగా నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రెండు పాన్ ఇండియా సినిమాలు.. 'హరిహరవీరమల్లు' , 'రాజా సాబ్'లలో నేను నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఒకేరోజు ఈ రెండు సినిమాల షూటింగ్స్ లో పాల్గొనడం మరింత ఆనందంగా ఉంది. అది కూడా ఒక సినిమా షూటింగ్ ఆంధ్రాలో, మరొకటి తెలంగాణలో జరుగుతుంది. ఈ రెండు సినిమాలు ఖచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని సోషల్ మీడియాలో రాసుకోచ్చింది నిధి. దాంతో ప్రభాస్, పవన్ అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.

## అడివిశేష్ డెకాయిట్ నుంచి శృతిహాసన్ ఔట్..

### – కొత్త భామను ప్రకటించే టైం ఫిక్స్..!

టాలీవుడ్ హీరో అడివిశేష్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ టాలెంటెడ్ యాక్టర్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం డెకాయిట్ ఈ చిత్రానికి షనీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఇప్పటికే లాంచ్ చేసిన డెకాయిట్ టైటిల్ టీజర్.. మాజీ ప్రేమికుల శత్రుత్వంతో సినిమా కొత్త పంథాలో సాగబోతుందని హింట్ ఇచ్చాడు డైరెక్టర్.అయితే ఎవరూ ఊహించని విధంగా డెకాయిట్ నుంచి శృతిహాసన్ తప్పుకుందని వార్తలు కూడా తెరపైకి వచ్చాయి. తన పాత్రకు సంబంధించి, ప్రొడక్షన్ హౌస్‌తో నెలకొన్న సమస్యల కారణంగా నేపథ్యంలో శృతిహాసన్ సినిమా నుంచి తప్పుకుందట. ఈ నేపథ్యంలో మరో పాపులర్ హీరోయిన్‌ను శృతిహాసన్ ప్లేస్‌లో తీసుకున్నారట. అంతేకాదు వచ్చే వారమే ఆ హీరోయిన్ ఎవరో చెప్పబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఇదే నిజమైతే మరోసారి టైటిల్ టీజర్ నుంచి మరోసారి షూటింగ్ మొదలుపెట్టాల్సిందేనన్నమాట అడివి శేష్ ఇప్పటికే 'గూఢచారి'కి సీక్వెల్‌గా వస్తున్న 'జీ2' లో కూడా నటిస్తున్నాడు. వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. ఈ మూవీ పోస్టర్లు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s. SRI DIVYA PRINTERS, Plot No.33 & 34, 2nd Floor, Vasthu Colony, LB. Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana -500035. Chief Editor: V.N.RAJU RNI. No. TELTEL/2015/62524. Cell: 8499094183 / 9966443465.